క్లుప్తంగా

క్యాలెండర్ ఆవిష్కరణ



గద్వాల అర్బన్: జిల్లా దివ్యాంగుల ఉద్యోగుల సంఘానికి సంబంధించిన క్యాలెండర్‌ను ఆదివారం జిల్లా కేంద్రంలోని జెడ్పీ క్యాంపు కార్యాలయంలో జెడ్పీ చైర్‌పర్సన్ సరిత ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు లక్ష్మీకాంత్‌రెడ్డి, నర్సింహులు, గోవిందు, రామేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల వాల్‌పోస్టర్ విడుదల

అయిజ: పట్టణంలో ఫిబ్రవరి 8 నుంచి నిర్వహించనున్న తిక్కవీరేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆదివారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో విడుదల చేశారు. ఉత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయాలి

రాజోళి: అలంపూర్ నియోజకవర్గానికి అగ్నిమాపక కేంద్రం అందుబాటులో లేక ప్రమాదాలు పెరిగిపోతున్నాయని తెలంగాణ దండోరా జిల్లా ఉపాధ్యక్షుడు ఆశీర్వాదం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం మండలంలో గడ్డివాములు తగలడబడ్డాయని, స్థానికులు త్వరగా స్పందించడంతో పెద్ద ప్రమాదం తప్పిందని అయినప్పటికీ పశుగ్రాసం దగ్ధమైందని తెలిపారు. ఫైర్‌ఇంజన్ గద్వాల నుంచి వచ్చేలోగా ప్రమాద తీవ్రత పెరుగుతుందని, రాజోళి, వడ్డేపల్లి మండలాల్లోని ఆయా గ్రామాలు సరిహద్దులో ఉండటం వల్ల మరింత ఆలస్యమై ప్రమాదాన్ని నివారించలేకపోతున్నామని, నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు అందుబాటులో ఉండేలా అగ్నిమాపక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

ధర్నాను జయప్రదం చేయండి



గద్వాల అర్బన్: భవన నిర్మాణ, ఇతర కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఫిబ్రవరి 1న కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టనున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు కోళ్ల అంజి తెలిపారు. ఈ ధర్నాకు సంబంధించిన పోస్టర్‌ను ఆదివారం జిల్లా కేంద్రంలో విడుదల చేశారు. ఈ ధర్నాకు భవన నిర్మాణ కార్మికులు అధికంగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మన్యం, నర్సింహులు, ఆంజనేయులు, గణేష్, పరశురామ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



గద్వాల అర్బన్: డ్వాక్రా మహిళలను చైతన్యం చేస్తూ ఆర్థికంగా, సామాజికంగా ఎదగడానికి గ్రామాల్లో పనిచేస్తున్న ఐకేపీ వీఓఏల సమస్యలను పరిష్కరించాలని జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. సెర్ప్ నుంచి రూ.15వేలు వేతనం చెల్లించాలని, వీఓఏలను ఉద్యోగులుగా గుర్తించాలని, ఐడీ కార్డులు, ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు అంజి, రాధమ్మ, తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.

నేటినుంచి నారాయణస్వామి ఉత్సవాలు



మానవపాడు: బాలయోగి శివనారాయణ స్వామి ఉత్సవాలకు ఆదివారం మండలంలోని నారాయణపురం గ్రామంలో ఏర్పాట్లను చేశారు. సోమవారం రాత్రి నుంచి మంగళవారం రాత్రి వరకు అఖండ భజన పోటీలను, పూజలు, వ్రతాలు భక్తులు నిర్వహిస్తారు. 31న రమాసహిత సత్యనారాయణ స్వామి కల్యాణం,, మధ్యాహ్నం 1గంట నుంచి సమారాధన, అన్నదానం, రథోత్సవం చేపడుతారు. ఉత్సవాలలో మిఠాయి దుకాణలు, ఆటబొమ్మలు, గాజుల దుకాణాలు వెలిశాయి.

టెండర్ దశ దాటేదెన్నడో?

- 10 నెలల క్రితం పాఠశాల భవనాలు కూల్చివేత
- కాలయాపన చేస్తున్న అధికారులు
- గట్టు, మల్దకల్ మండలాల్లో విద్యార్థుల ఇబ్బందులు



గట్టులో కూల్చి వేసిన భవనాలు



గట్టులో చెట్ల కింద కొనసాగుతున్న తరగతులు

గట్టు: ఎంతో చారిత్రక కట్టడాలను మన ఊరు–మన బడి పథకంలో భాగంగా పాఠశాల పాత భవనాలను కూల్చి వేయించిన అధికారులు పనులను మాత్రం 10 నెలలు గడుస్తున్నా ప్రారంభించలేదు. మండల కేంద్రంలో ఉన్నత పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి వరకు కొనసాగుతుంది. ఇక్కడ 520 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. గట్టు, ఆరగిద్ద, గొర్లఖాన్‌దొడ్డి, సల్కాపురం, పెంచికలపాడు చెందిన విద్యార్థులు ఇక్కడికి వస్తుంటారు. ఏడాది క్రితం ప్రభుత్వం తీసుకువచ్చిన మన ఊరు–మన బడి పథకం ద్వారా పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన వసతులను కల్పించేందుకు పాఠశాల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టింది. గట్టు, మాచర్ల, తప్పెట్లమొర్సులో ఉన్నత పాఠశాలలు, మల్దకల్ మండలంలోని మల్దకల్, బిజ్వారం, పాల్వాయి పాఠశాలల్లోనూ టెండర్ల ద్వారా పనులు చేపట్టాల్సి ఉండగా, ఇప్పటికి పనులను ప్రారంభించలేదు. గదుల కొరత తీరుతుందని భావించిన విద్యార్థుల ఆశలు ఎప్పుడు నెరవేరుతాయో తెలియని అయోమయం నెలకొంది.

టెండర్లకు వెనుకంజ..

మన ఊరు–మన బడి పథకంలో భాగంగా ఆయా పాఠశాలల్లో చేపట్టే పనులు రూ.35 లక్షలు దాటితే తప్పనిసరిగా టెండర్లను పిలవాలనే నిబంధన పెట్టారు. అయితే గట్టు, మాచర్ల, తప్పెట్లమొర్సు ఉన్నత పాఠశాలల్లో దాదాపుగా రూ.60 లక్షల దాకా పనులు చేపట్టాల్సి ఉంది. పాఠశాల పనులకు టెండర్లు వేసేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు.

ఉన్న వాటిని కూల్చేసి..

మండలంలోని ఉన్నత పాఠశాలలో భవనాలను అధికారులు ముందస్తుగానే కూల్చివేశారు. టెండర్లు పూర్తికాక పోవడంతో పనుల ప్రారంభం మరింత జాప్యం అవుతుంది. ఇప్పటికే విద్యా సంవత్సరం పూర్తి కావస్తుండగా, గదుల కొరత కారణంగా ఇక్కడ విద్యార్థులు పాఠశాల ఆవరణలో చెట్ల కింద కూర్చొని చదువుకుంటున్నారు.

నిధులు మంజూరయ్యాయి

గట్టు ఉన్నత పాఠశాలకు మన ఊరు–మన బడి పథకం ద్వారా ప్రస్తుతం రూ.కోటి20లక్షలు మంజూరయ్యాయి. మొదట్లో 5 గదులు నిర్మించాలనుకున్నాం. మరో అదనపు గది కోసం ప్రయత్నించే క్రమంలో ఆలస్యమైంది. ప్రస్తుతం 6 గదులకు నిధులు మంజూరయ్యాయి. ఈ పనులు టెండర్ దశలో ఉన్నాయి. టెండర్లు పూర్తయిన వెంటనే పనులు ప్రారంభించి, సకాలం పూర్తి చేయిస్తాం.

–రవీందర్, డిప్యూటీ ఈఈ, పీఆర్, గద్వాల

పనులు వేగవంతం చేయాలి



అలంపూర్‌లో డ్రెయినేజీ పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్‌పర్సన్

అలంపూర్: మున్సిపాలిటీలో డ్రెయినేజీ పనులు వేగవంతం చేయాలని ఎమ్మెల్యే అబ్రహం సూచించారు. పట్టణంలో చేపడుతున్న పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ మనోరమతో కలిసి ఎమ్మెల్యే ఆదివారం పరిశీలించారు. మున్సిపాలిటీలో డివైడర్ విత్ సెంట్రల్ లైటింగ్‌లో భాగంగా రోడ్డు విస్తరణ పనులు చేపడుతున్నారని, రోడ్డు విస్తరణతో పాటు ఇరువైపుల డ్రెయినేజీ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. డ్రెయినేజీ నిర్మాణం అనంతరం డివైడర్, సెంట్రల్ లైటింగ్ పనులు పూర్తిచేయాలని చైర్‌పర్సన్ సూచించారు. మున్సిపాలిటీ సుందరీకరణ పనుల్లో జాప్యం లేకుండా వేగవంతంగా చేపట్టాలన్నారు. సుందరీకరణ పనులు జోగుళాంబ క్షేత్రానికి వచ్చే యాత్రికులను ఆకర్షించే విధంగా ఉండాలన్నారు.

పల్లెల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

ఎర్రవల్లిచౌరస్తా: పల్లెలను అభివృద్ధి చేయడమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే అబ్రహం అన్నారు. ఆదివారం ఇటిక్యాల మండలంలోని ఆర్.గార్లపాడులో సీసీ రోడ్డు, మైనార్టీ కమ్యూనిటీ హాలు నిర్మాణం కోసం ఎమ్మెల్యే భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో పల్లె ప్రకృతి వనాలు, డంపింగ్‌యార్డులు, వైకుంఠధామాలను, నర్సరీలను ప్రత్యేకంగా ప్రభుత్వం నిర్మించిందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పద్మ, ఎంపీటీసీ మల్లేష్, తదితరులు ఉన్నారు.

హోరాహోరీగా బాస్కెట్‌బాల్ పోటీలు



అయిజ: మండలంలోని ఉత్తనూరులో నిర్వహిస్తున్న ధన్వంతరి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల అంతరాష్ట్ర వృషభరాజముల పోటీలు ఆదివారం కొనసాగాయి. ముఖ్య అతిథిగా మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు హాజరయ్యారు. ఈ సందర్భంగా సబ్ జూనియర్ బండలాగు పోటీలను ప్రారంభించారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన వృషభరాజులు హోరా హోరీగా తలపడ్డాయి. అదేవిధంగా ఉమ్మడి తెలుగు రాష్ట్రాల మెన్, ఉమెన్ బాస్కెట్‌బాల్ పోటీలు మూడవ రోజు కొనసాగాయి.

కఠిన చర్యలు తీసుకోవాలి

గద్వాల అర్బన్: హాస్టల్‌లో ఉంటున్న విద్యార్థినిపై అత్యాచారానికి పాల్పడిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు ఆదివారం ప్రకటనలో డిమాండ్ చేశారు. హాస్టల్ నిర్వాహకులు విద్యార్థిని బెదిరింపులకు గురిచేస్తూ బలవంతంగా అఘాయిత్యానికి పాల్పడిన వారిపైన చట్టపరంగా చర్యలు తీసుకుని, ఇలాంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా చూడాల్సిన అవసరముందని నాయకులు ప్రవీణ్, హనమేష్, రఘు, మహేష్ తదితరులు డిమాండ్ చేశారు.

ఉన్నత లక్ష్యం దిశగా చదవండి



మాట్లాడుతున్న విద్యార్థిని

రాజోళి: ఉన్నత చదువులే లక్ష్యంగా గురిపెట్టాలని ఎంవీ ఫౌండేషన్ మండల కో ఆర్డినేటర్ హనిమిరెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ఉర్దూ పాఠశాలలో కిశోర బాలికలకు జెండర్, బాలల హక్కులు, బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కల్పించారు. తల్లిదండ్రులకు చదివితే భవిష్యత్‌లో కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించాలని, అందరిని పాఠశాలలకు, కళాశాలలకు పంపేలా చైతన్యం చేసే బాధ్యత బాలికలపైన ఉందన్నారు. దానికి సంబంధించి గ్రూపు సమావేశాలు ఏర్పాటు చేశారు. సమావేశంలో బాలికలు తమ ఆలోచనలు, లక్ష్యాలను తెలియజేశారు. బాల కార్మిక వ్యవస్థకు, బాల్య వివాహాలను వ్యతిరేకిస్తామని, వాటి నివారణకు కృషి చేస్తామని విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో అబ్దుల్ రహిమాన్, నాగ పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

పార్టీని మరింత బలోపేతం చేస్తాం



కేటీదొడ్డి: రానున్న రోజుల్లో వైఎస్సార్ తెలంగాణ పార్టీ మరింత బలోపేతం చేస్తామని అసెంబ్లీ కోఆర్డినేటర్ అతికుర్ రెహమాన్ అన్నారు. ఆదివారం మండలంలోని ఇర్కిచేడులో మండల అధ్యక్షుడు నర్సింహరెడ్డి ఆధ్వర్యంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి సంక్షేమ పాలన మళ్లీ రావాలంటే షర్మిలకు ప్రజలు అండగా ఉండాలని కోరారు. వచ్చే ఎన్నికలలో పార్టీ గెలవడం ఖాయమని తెలిపారు. అనంతరం గ్రామంలోని సుమారు 50 మంది పార్టీలో చేరి కండువాలు కప్పుకున్నారు. కార్యక్రమంలో వెంకటప్ప, తిమ్మయ్య, జయప్ప, చంద్రశేఖర్, రాజన్న, సలీం, నీలకంటిగౌడు, రాజు, రంగప్ప, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



గద్వాలలో సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

గద్వాల: ఎక్కడెక్కడివారో జిల్లా కేంద్రంలో చదివి ఉద్యోగాలు, వ్యాపారాలు చేస్తూ.. పలు ప్రాంతాల్లో స్థిరపడ్డారు. 25 వసంతాల అనంతరం వారంతా మళ్లీ కలిశారు. చిన్ననాటి స్మృతులు జ్ఞాపకం తెచ్చుకున్నారు. ఎంఏఎల్‌డీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 1994–97లో డిగ్రీ పూర్తిచేసిన సైన్స్ విద్యార్థులు ఆదివారం కళాశాల ఆవరణలో పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఏర్పాటు చేశారు. అప్పటి కళాశాల అధ్యాపకులను పూర్వ విద్యార్థులు సన్మానించి, ఆనాటి జ్ఞాపకాలను స్మరించుకున్నారు. వృత్తులు, వ్యాపకాలు, కుటుంబ నేపథ్యం, పిల్లల చదువులు, బాగోగుల గురించి పరస్పరం తెలుసుకున్నారు. విద్యార్థులు ప్రత్యేకంగా సమావేశాలు ఏర్పాటు చేసుకుని కళాశాల అనుభూతులను నెమరవేసుకున్నారు. కళాశాల మొత్తం కలియ తిరిగారు. పూర్వ విద్యార్థులు ఉన్నత స్థానాల్లో ఉండి ఇప్పటి విద్యార్థులకు ఆదర్శంగా నిలిచారని అధ్యాపకులు పేర్కొన్నారు.

మానవపాడులో..

మానవపాడు: ఆనాటి అక్షరాలు నేర్పిన పాఠశాల జ్ఞాపకాలు ఎప్పటికీ పూర్వ విద్యార్థులకు మధురమైన జ్ఞాపకాలుగా ఉంటాయని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2000–1లో పదో తరగతి చదివిన విద్యార్థులు పేర్కొన్నారు. ఆదివారం మండలకేంద్రంలో ఒకే వేదికపై ఉపాధ్యాయులను సన్మానించి, ఉపాధ్యాయులు దివంగత ఉస్మాన్, కేశవయ్యకు నివాళులు అర్పించారు. పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ.. చదువు చెప్పిన గురువులను మరచిపోకుండా వారిని గౌరవించడం మన బాధ్యతగా భావించామన్నారు. తమలాంటి ఎంతోమంది విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించి, తీర్చిదిద్దిన గురువులను సన్మానించుకోవడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు షాలి భాషా, రాఘవేంద్ర, బీసీరెడ్డి, నరేష్, బజారన్న, అశోక్‌చక్రవర్తి, జగదీష్, శేషన్న, సలీమ్, వెంకటేష్, మధర్, మద్దిలేటి, నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.



మానవపాడులో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థులు

నేటినుంచి హాజీమలాంగ్‌బాబా ఉర్సు



అమరచింత: మస్తీపురం గుట్టలో వెలసిన సయ్యద్ షా హజ్రత్ హాజీ మలాంగ్ బాబా ఉర్సు ఆదివారం రాత్రి గంధోత్సవంతో ప్రారంభం అవుతున్నాయని నిర్వాహకులు తెలిపారు. ఈమేరకు ముర్షద్ మైనోద్దీన్ మాట్లాడుతూ 29న గంధోత్సవం, 30న ఉర్సు, 31న ఫాతేహా కార్యక్రమాలు కొనసాగనున్నాయన్నారు. హాజీమలాంగ్ బాబా దర్గాను దర్శించడానికి రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరవుతున్నారని తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా దర్గా వద్ద నిర్వహణ కార్యక్రమాలను చేపడుతున్నామని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదం.. జీవితం చీకటిమయం

- వెన్నముక విరిగి మంచానికే పరిమితం
- ఏడాది నుంచి కదల్లేని స్థితిలో యువకుడు
- చిన్నపిల్లాడిలా కాపాడుకుంటున్న తల్లిదండ్రులు
- రూ.10లక్షలు ఖర్చు చేసినా ఫలితం శూన్యం



మహేష్

కేటీదొడ్డి: పేదరికం వల్ల ఆ యువకుడు చదువుకు దూరమయ్యాడు. బాల్యమంతా తోబుట్టువుల సంరక్షణకే సరిపోయింది. పరిస్థితులు కొంత కుదుటపడ్డాయి అని అనుకున్నారు. పెళ్లి చేయాలని ఇంట్లో యోచిస్తున్న వేళ రోడ్డు ప్రమాదం యువకుడి జీవితంలో చీకటిని నింపింది. శరీరం అచేతనంగా మారటంతో ఏడాది నుంచి మంచానికి పరిమితం కావాల్సి వచ్చింది. జోగుళాంబ గద్వాల జిల్లా కేటీదొడ్డి మండలం ఇర్కిచేడుతండాకు చెందిన మోతి నాయక్, శాంతిబాయి దంపతులకు మహేష్, జయమ్మ, లక్ష్మి, రవి ఉన్నారు. స్థానికంగా ఉపాధి లేక ఆ దంపతులు గతంలో హైదరాబాద్‌కు వలస వెళ్లారు. తల్లిదండ్రులు అష్టకష్టాలు పడి పిల్లలను పెంచారు. తల్లిదండ్రులతో కలిసి మహేష్ పనులకు వెళ్లేవాడు. పెద్ద కూతురు జయమ్మకి పెళ్లి చేయాలని తల్లిదండ్రులు ప్రయత్నాలు మొదలు పెట్టింది. ఈ క్రమంలో మార్చి 2021 ఇర్కిచేడు గ్రామానికి పెళ్లి సంబంధం చూడాటానికి వచ్చారు. అదే రోజు ఉదయం 9 గంటల సమయంలోని హైదరాబాద్‌లో టిఫిన్ కట్టుకుని బుద్వేల్ రోడ్డుపై నడుచుకుంటూ మహేష్ పనులకు బయలుదేరాడు. రోడ్డు దాటుతుండగా ఓ కారు వచ్చి ఆయనను బలంగా ఢీకొట్టింది. దీంతో యుకువడి నడుము పూర్తిగా విరిగిపోయింది. వెంటనే బుద్వేల్‌లో ఉన్న ఆస్పత్రిలో చేర్పించారు. రెండు రోజుల తర్వాత మరో ఆస్పత్రిలో 20 రోజులు ఉంచారు. అనంతరం మహబూబ్‌నగర్‌లో 2 నెలలు, ఆ తర్వాత గద్వాల ప్రభుత్వ ఆస్పత్రిలో 2 నెలలు చేర్పించి ఆ తర్వాత డిశ్చార్జ్ చేశారు. తెలిసిన వారితో అప్పు చేసి ఆస్పత్రులకు దాదాపుగా రూ.10 లక్షలు ఖర్చు చేసినా ఫలితం దక్కలేదు. మరింత ఖర్చు చేసేందుకు డబ్బులు లేకపోవడంతో మహేష్‌ను ఇంటికి తీసుకొచ్చారు.

లేవలేడు.. కూర్చోలేడు..

నడుము విరగిపోవటంతో లేవలేడు, కూర్చోలేడు. మొండెం నుంచి కింది భాగం పూర్తిగా స్పర్శ కోల్పోవటంతో మలమూత్రాలు వచ్చినా ఆయనకు తెలియటం లేదు. అతన్ని తల్లిదండ్రులు కాలకృత్యాల నుంచి స్నానం చేయించటం, భోజనం పెట్టడం వరకు అన్ని సపర్యలు చేస్తున్నారు. రోజంతా ఆయనను కనిపెట్టుకుని ఉండాల్సి రావటంతో తల్లి, తండ్రి పనులకు కూడా వెళ్లలేని పరిస్థితి. కుటుంబ పరిస్థితి చూసిన బంధువులు, తెలిసిన వారు ఇచ్చే డబ్బులతో నిత్యావసరాలు కొని రోజులు గడుపుతున్నారు. తన నిస్సహాయ స్థితిని, తల్లితండ్రులు పడుతున్న కష్టాలు తలుచుకుని మహేష్ కన్నీటి పర్యాంతమవుతున్నాడు. పెద్ద ఆస్పత్రుల్లో వైద్యం చేయించునే స్థోమత లేదని ప్రభుత్వం స్పందించి కనీసం తన అవసరాలు తానే తీర్చుకునేలా మెరుగైనా వైద్యం చేయించాలని తల్లిదండ్రులు వేడుకుంటున్నారు.



మహేష్‌కు భోజనం తినిపిస్తున్న తల్లి

కరాటే పోటీలో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ఎస్ఐ

పెబ్బేరు: పట్టణ కేంద్రంలోని సుమన్ కరాటే కిడ్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఇంటర్ డోజో కరాటే చాంపియన్‌షిప్ పోటీలు ఆదివారం నిర్వహించారు. ఈ పోటీలకు ముఖ్య అతిథిగా హాజరైన ఎస్ఐ రామస్వామి మాట్లాడుతూ ఆత్మరక్షణ కోసం కరాటేను ప్రతి ఒక్కరూ నేర్చుకోవాలని సూచించారు. ముఖ్యంగా బాలికలకు కరాటే నేర్పించేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపాలన్నారు. ఈ పోటీల్లో పెబ్బేరు, కొత్తకోట విద్యార్థులు 100 మంది పాల్గొనగా.. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.

నీటి సమస్యల పరిష్కారానికే జలదీక్ష



జలదీక్షకు బయలుదేరుతున్న నాయకులు

గద్వాల అర్బన్: నడిగడ్డలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేయాలని, భూ నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించాలని తెలంగాణ జన సమితి జిల్లా కన్వీనర్ ప్రకాష్‌గౌడ్ డిమాండ్ చేశారు. కృష్ణా జిల్లాల్లో నీటి వాటా, విభజన హామీల సాధనకై రాష్ట్ర అధ్యక్షుడు కోదండరాం ఆధ్వర్యంలో సోమవారం ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద జలదీక్ష చేపట్టనున్నట్లు తెలిపారు. దీక్షకు ఆదివారం జిల్లా కన్వీనర్ ఆధ్వర్యంలో జిల్లా నుంచి పెద్ద ఎత్తున్న నాయకులు బయలుదేరారు. రైతాంగానికి గొడ్డలిపెట్టులాంటి కృష్ణా, తుంగభద్ర నదులపై ఆంక్షలు విధిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన గెజిట్‌ను వెంటనే రద్దు చేయాలని, నీటి సమస్యలను పరిష్కారానికై ఢిల్లిలో దీక్ష చేపట్టనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

కమీషన్ల కోసమే ‘దళితబంధు’



మాట్లాడుతున్న నియోజకవర్గ అధ్యక్షుడు మహేష్

శాంతినగర్: కమీషన్ల కోసమే దళితబంధు పథకం తీసుకొచ్చారని బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు మహేష్ మండిపడ్డారు. వడ్డేపల్లి మున్సిపాలిటీ పరిధిలో నాయకులు ఆదివారం పర్యటించారు. ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా దళితబంధు పథకంలో అవినీతి రాజ్యమేలుతోందని ఆరోపించారు. దళితులకు ఇచ్చే రూ.10లక్షల్లో రూ.2 లక్షలు కమీషన్ రూపేనా బీఆర్ఎస్ నాయకులకు ఇస్తేనే మంజూరు చేస్తున్నార న్నారని, బీఆర్ఎస్ నాయకుల కడుపులు నింపడానికే పథకం ప్రవేశపెట్టినట్లుందని ఎద్దేవాచేశారు. ఏటా సరిగా పంటలు పండక ఎంతో మంది రైతులు ఆకలి చావులు చస్తుంటే కేసీఆర్‌కు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. వారి తప్పులను కప్పిపుచ్చుకోవడానికి పథకాల పేరుతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని అన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ప్రజలు తగిన బుద్ధి చెబుతారని, నీలి జెండాకు మద్దతు పలుకుతారన్నారు. కార్యక్రమంలో రవిచందర్, లక్ష్మన్న, సుందర్‌రాజు, నాగరాజు, జలంధర్, వెంకటేష్, స్వామినాయుడు, రవిప్రకాష్, కృష్ణనాయుడు, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.